www.kalamdaily.com

# కలం

ప్రజల గళం..

Follow on: Kalamtelugu

గురువారం 12-02-2026

360° SINGLE PAGE TOPIC

## చట్టసభలు – సెక్యూరిటీ

లోక్‌సభలో ప్రధాని మోదీ భద్రతకు ముప్పు ఉందని స్పీకర్ ఓం బిర్లా ఇటీవల సభావేదికగానే ప్రకటన చేశారు. నిండు సభలో ప్రధానికే భద్రత కరువైందా? ఇదే నిజమైతే మిగిలిన సభ్యుల భద్రత సంగతేంది? తెలంగాణ బిల్లు టైమ్‌లో లోక్‌సభలో ఎంపీ లగడపాటి పెప్పర్ స్ప్రే ప్రయోగించారు. సభ్యులు ఆందోళనతో బయటకు పరుగులు తీశారు. మూడేండ్ల కింద ఓ విజిటర్ స్మోక్ కానిస్టర్ ప్రయోగించాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో గవర్నర్ ప్రసంగిస్తుండగా సభ్యులు కొందరు బల్లలపై నిలబడి హంగామా చేయడం, తమిళనాడు సభలో జయలలిత పట్ల అనుచిత ప్రవర్తన, యూపీ అసెంబ్లీలో గాల్లోకి లేచిన కుర్చీలు, మైకులు .. ఇలా ఎన్నో ఘటనలు రాష్ట్రాల చట్టసభల్లో జరిగాయి. ఫలితంగా ఆంక్షలు కఠినమయ్యాయి. చట్టసభల్లో సభ్యులు పాటించాల్సిన నిబంధనలేంటి?.. నిషేధపు వస్తువులేంటి?.. సభ్యులకున్న భద్రత ఎంత?..

వీటిపై కలం 360 డిగ్రీస్ ప్రత్యేక కథనం..

- తెలంగాణ బ్యూరో, కలం



# చట్టసభల్లో సభ్యులకు భద్రత ఎంత?

## చర్చనీయాంశంగా లోక్‌సభ స్పీకర్ వ్యాఖ్యలు

- ప్రధాని మోదీకే ముప్పు ఉందంటూ కామెంట్లు
- పార్లమెంట్‌లో సెక్యూరిటీ, నిబంధనల ఉల్లంఘనలపై చర్చ
- తెలంగాణ బిల్లు సందర్భంగా సభలో పెప్పర్ స్ప్రేతో లగడపాటి హల్‌చల్
- రాష్ట్రాల అసెంబ్లీల్లోనూ అనేక అవాంఛనీయ ఘటనలు



### లగడపాటి పెప్పర్ స్ప్రే

భారత పార్లమెంట్ చరిత్రలో చట్టసభల్లోనే కొన్ని షాకింగ్ ఘటనలు జరిగాయి. అందులో లగడపాటి రాజగోపాల్ పెప్పర్ స్ప్రే ఉదంతం ఓ మచ్చలాంటిది. 2014 ఫిబ్రవరి 13న అప్పటి హోంమంత్రి సుశీల్ కుమార్ షిండే లోక్‌సభలో తెలంగాణ బిల్లును ప్రవేశపెడుతుండగా సీమాంధ్ర ఎంపీలు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఆ ఎంపీల్లో ఒకరైన లగడపాటి రాజగోపాల్ తన జేబులో నుంచి పెప్పర్ స్ప్రే బాటిల్ తీసి గాల్లోకి కొట్టారు. దాంతో సభలోని మిగతా ఎంపీలు భయంతో పరుగులు తీశారు. పలువురు ఎంపీలు, సెక్యూరిటీ సిబ్బంది, మీడియా ప్రతినిధులు తీవ్రమైన కండ్ల మంటలు, శ్వాస సమస్యలతో ఇబ్బందులు పడ్డారు. ముగ్గురు ఎంపీలు అస్వస్థతకు గురికాగా ఆస్పత్రికి తరలించి ట్రీట్మెంట్ అందించారు.



### స్పీకర్ బల్లపై నోట్ల కట్టలతో..

2008 జులై 22న మన్మోహన్ సింగ్ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఆ టైమ్‌లో ముగ్గురు బీజేపీ ఎంపీలు సభలోకి వచ్చి.. ఓటు వేయాలంటూ తమకు లంచం ఇచ్చారని కోట్ల రూపాయల నోట్ల కట్టలను స్పీకర్ బల్లపై పెట్టి నిరసన తెలిపారు.



LIVE

### ఫేస్ బుక్ లైవ్ పెట్టి..

పార్లమెంట్ లోపల జరిగే దృశ్యాలను ఫోన్లలో రికార్డ్ చేయడం నిషిద్ధం. 2016లో అప్పటి ఎంపీ (ప్రస్తుత పంజాబ్ సీఎం) భగవంత్ మాన్ పార్లమెంట్ లోపలికి వెళ్లే మార్గాన్ని, ఇతర పరిసరాలను ఫేస్‌బుక్ లైవ్ ద్వారా చిత్రీకరించారు. ఇది పెద్ద వివాదానికి దారితీసింది.



### ఆవరణలో దమ్ము కొడ్తూ..

టీఎంసీ ఎంపీ సౌగత్ రాయ్ పార్లమెంట్ ఆవరణలోనే సిగరెట్ తాగుతూ చాలాసార్లు కెమెరాకు చిక్కారు. ఇటీవల దీనిపై బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు.



### సభలో దుండగుల హల్ చల్

పార్లమెంట్‌పై టెర్రరిస్ట్ అటాక్ (2001 డిసెంబర్ 13) జరిగిన 22 ఏండ్ల తర్వాత సరిగ్గా అదే రోజు (2023 డిసెంబర్ 13) లోక్‌సభలో జీరో అవర్ జరుగుతుండగా పబ్లిక్ గ్యాలరీ నుంచి సాగర్ శర్మ, మనోరంజన్ అనే దుండగులు సభలోకి దూకారు. తమ బూట్లలో దాచుకున్న స్మోక్ బాంబులను విసిరారు. దీంతో సభ మొత్తం పసుపు రంగు పొగ అలుముకుంది. అదే సమయంలో పార్లమెంట్ బయట నీలం, ఎరుపు రంగు స్మోక్ బాంబులతో మరికొందరు నిరసన తెలిపారు. నిందితులు మైసూర్ ఎంపీ ప్రతాప్ సింహా సిఫార్స్‌తో విజిటర్ పాస్‌లు పొందినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. నిందితులపై ఉపా చట్టం కింద కేసు పెట్టాయి.





### 2014 తర్వాతే రూల్స్ కఠినం

రాజ్యాంగంలోని ఆర్టికల్ 105 ప్రకారం పార్లమెంటు ఉభయ సభల్లో ఎంపీలకు, 194 ప్రకారం అసెంబ్లీల్లో ఎమ్మెల్యేలకు కొన్ని ప్రివిలేజెస్ ఉంటాయి. చట్ట సభల్లోకి స్వేచ్ఛగా వెళ్లడం, మాట్లాడడం సభ్యులుగా వారికి లభించిన హక్కు. వారిని ఎంట్రీ పాయింట్ల దగ్గర ఫిజికల్‌గా చెకింగ్ చేయడానికి, చేయకపోవడానికి నిర్దిష్టమైన నిబంధనలేమీ లేవు. వారి హక్కులకు, గౌరవానికి భంగం కలిగించే అంశం సున్నితమైనది కావడంతో ఎంపీలను, ఎమ్మెల్సీలను, ఎమ్మెల్యేలను ఫిజికల్‌గా చెకింగ్ చేసే సంప్రదాయం లేదు. కానీ, 2014లో ఎంపీ లగడపాటి రాజగోపాల్ పెప్పర్ స్ప్రే ఘటన తర్వాత మొత్తం పార్లమెంట్ ప్రాంగణానికి కస్టోడియన్‌గా ఉండే లోక్‌సభ స్పీకర్ కొన్ని ప్రొటోకాల్ నిబంధనలను ప్రవేశపెట్టారు. అప్పటివరకూ చిన్న ఆయుధాలను (పిస్టల్స్, రివాల్వర్స్) తీసుకెళ్లడంపై మాత్రమే ఉన్న నిబంధనను సవరించి పెప్పర్ స్ప్రే, స్మోక్ కానిస్టర్లు, ప్లకార్డులు, బ్యానర్లు లాంటివి సభ లోపలికి తీసుకెళ్లకుండా నిషేధాజ్ఞలు విధించారు. 2024లో విజిటర్‌గా వచ్చిన వ్యక్తి లోక్‌సభలో స్మోక్ బాంబ్ తరహా ఘటనకు పాల్పడడంతో ఈ నిబంధనలు మరింత కఠినతరమయ్యాయి.


- ఉభయ సభల్లోకి వెళ్లడానికి మకరద్వారం ఎంట్రీ పాయింట్‌ను ప్రత్యేకంగా ఎంపీల కోసమే కేటాయించారు. వారు మాత్రమే దాని నుంచి వెళ్లాలి. ఇతరులకు ఆ ఎంట్రీ నుంచి ప్రవేశం ఉండదు.
- ఎంపీలంతా తప్పనిసరిగా వారి బ్యాగులు, ల్యాప్‌టాప్‌లను విధిగా ఎక్స్–రే స్కానర్‌లో చెకింగ్ చేయించాల్సి ఉంటుంది.
- ఎంపీలంతా విధిగా డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ ద్వారా ప్రవేశించాలి. ఫేషియల్ రికగ్నిషన్ డివైస్‌లో వారి ఎంట్రీ రికార్డు కావాలి. లేదా స్మార్ట్ కార్డు ద్వారా ఎంట్రీ కావాలి.
- స్మోక్ బాంబ్ తరహా ఘటన జరగడంతో పార్లమెంటు భద్రతా వ్యవస్థ సీఐఎస్ఎఫ్ చేతుల్లోకి వెళ్లింది.

### ఓం బిర్లా ఏమన్నారంటే..?



ప్రస్తుతం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. ఇటీవల రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా మాజీ సీడీఎస్ నరవణె బుక్‌లోని అంశాలను ప్రస్తావించేందుకు రాహుల్ గాంధీకి స్పీకర్ అనుమతి ఇవ్వలేదు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో కొందరు మహిళా ఎంపీలు ప్రధాని మోదీ కూర్చునే బెంచ్‌ను చుట్టుముట్టారు. అప్పటికీ ఆయన ఇంకా సభకు రాలేదు. ప్రతిపక్ష సభ్యుల నిరసనలతో ఆ రోజు సభను వాయిదా వేసిన స్పీకర్.. మరుసటి రోజు ఆ ఘటనపై సభలో ప్రకటన చేశారు. "నిన్న కొందరు ప్రతిపక్ష ఎంపీలు నా ఆఫీసులో దురుసుగా ప్రవర్తించారు. ఇది పార్లమెంట్ చరిత్రలోనే మాయని మచ్చ. ప్రధాని ప్రసంగించే టైమ్‌లో గందరగోళం సృష్టించాలని ప్రతిపక్ష ఎంపీలు ప్లాన్ చేసినట్టు నాకు విశ్వసనీయ సమాచారం అందింది. ఆయన భద్రతకు ముప్పు ఉందన్న ఆందోళనల నేపథ్యంలో సభకు రావొద్దని ప్రధానికి సూచించాను" అని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. అయితే స్పీకర్ ప్రకటనపై మహిళా ఎంపీలు మండిపడ్డారు. "మా నిరసన ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగానే సాగింది. మేం సభలో హింసకు దిగాలనుకోలేదు. ప్రధానికి ప్రతిపక్షాలను ఎదుర్కొనే ధైర్యం లేదు. అందుకే ఆయన స్పీకర్ వెనుక దాక్కుంటున్నారు" అని ఫైర్ అయ్యారు.

## రాష్ట్రాల్లో జరిగిన ఘటనలు



### యూపీ: కుర్చీలతో కుస్తీ




1997లో ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ, బీఎస్పీ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. సీఎంగా మాయావతి, కల్యాణ్ సింగ్ 6 నెలల చొప్పున ఉండేందుకు నిర్ణయం జరిగింది. ముందుగా మాయవతి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే తన టర్మ్ ముగిసిన తర్వాత ఆమె అధికారం అప్పగించేందుకు నిరాకరించి, మద్దతు ఉపసంహరించుకుంది. దీంతో విశ్వాస పరీక్షలో మెజార్టీ నిరూపించుకోవాలని మాయావతిని గవర్నర్ ఆదేశించారు. అసెంబ్లీ సెషన్ మొదలుకాగానే కాంగ్రెస్, బీఎస్పీ ఎమ్మెల్యేలు నిరసనకు దిగారు. ఎమ్మెల్యేలు ఒకరిపై ఒకరు మైక్‌లు, కుర్చీలు విసిరేసుకోవడంతో పలువురు గాయపడ్డారు. ప్రతిపక్షాలు సభను బహిష్కరించాయి. ఆ తర్వాత కల్యాణ్ సింగ్ మెజారిటీ నిరూపించుకుని రెండోసారి సీఎం అయ్యారు.

### బెంగాల్: ఒకరిపై ఒకరు పిడిగుద్దులు

2006లో టాటా నానో ప్రాజెక్టు భూసేకరణకు నిరసనగా సింగూర్‌కు వెళ్తున్న టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆమె ఆగ్రహంతో అసెంబ్లీకి వెళ్లారు. అప్పటి సీపీఎం ప్రభుత్వం బడ్జెట్ పెడుతుండగా మమత, టీఎంసీ ఎమ్మెల్యేలు సభలో ఫర్నిచర్ ధ్వంసం చేశారు. పేపర్లను చింపి గాల్లోకి విసిరారు. 2022లో 'బీర్భూమ్ హింస' పై చర్చ సందర్భంగానూ ఒకరిపై ఒకరు సభ్యులు పిడిగుద్దులు కురిపించుకున్నారు.

### ఏపీ: ప్రతిపక్ష నేత కన్నీళ్లు



2021లో వైసీపీ ప్రభుత్వ హయాంలో తన కుటుంబసభ్యులను కించపరిచారని ప్రతిపక్ష నేత చంద్రబాబు కన్నీరు పెట్టుకుంటూ సభ నుంచి వెళ్లిపోయారు. అదేవిధంగా 2023లో జీవో నెంబర్ 1పై అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ ఎమ్మెల్యేల మధ్య తోపులాట జరిగింది. టీడీపీ ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయ స్వామి, వైసీపీ ఎమ్మెల్యే టి.జె.ఆర్ సుధాకర్ బాబు మధ్య భౌతిక దాడులు జరిగినట్టు ఇరుపక్షాలు ఆరోపించాయి.

### గుజరాత్: అంగీలు చినిగేలా..

1996లో సీఎం సురేష్ మెహతా నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంపై విశ్వాస పరీక్ష ఎదుర్కొంటున్న టైమ్‌లో.. ఆ పార్టీ నేత శంకర్ సింగ్ వాఘేలా తిరుగుబాటు చేయడంతో సంక్షోభం నెలకొంది. సభ ప్రారంభం కాగానే ఎమ్మెల్యేలు ఒకరిపై ఒకరు కుర్చీలు విసురుకున్నారు. కొందరు ఎమ్మెల్యేల అంగీలు చినిగిపోయాయి. చివరికి ప్రభుత్వం కూలిపోయి, రాష్ట్రపతి పాలన విధించారు.

### కర్నాటక: పోర్న్ వీడియోల కలకలం



కర్నాటక అసెంబ్లీలో ముగ్గురు మంత్రులు అశ్లీల వీడియోలను తమ మొబైల్స్‌లో చూడటం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. 2012లో ఈ సంఘటన జరిగింది. రేవ్ పార్టీల గురించి చర్చ జరుగుతున్నందున అక్కడ ఏం జరుగుతుందో తాము సెల్ ఫోన్‌లో చూశామని ముగ్గురు మంత్రులు చెప్పుకొచ్చారు. చివరికి ప్రజాగ్రహంతో వారు రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ పరిణామాలతో అసెంబ్లీ హాల్‌లోకి సెల్ ఫోన్లను స్పీకర్ బ్యాన్ చేశారు.

### కేరళ: స్పీకర్‌నే తోసేసి..!

2015లో కేరళ అసెంబ్లీలో బడ్జెట్ పెట్టకుండా ప్రతిపక్షాలు అడ్డుకున్నాయి. ఆర్థిక మంత్రి కేఎం మణిపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని, ఆయన బడ్జెట్ పెట్టొద్దని ప్రతిపక్ష ఎల్డీఎఫ్ ఎమ్మెల్యేలు అడ్డుపడ్డారు. స్పీకర్ కుర్చీని పైనుంచి కిందకు తోసేశారు. కంప్యూటర్లు, మైక్రోఫోన్లు పగలగొట్టారు.

### తమిళనాడు: దుశ్శాసన పర్వం







తమిళనాడు అసెంబ్లీలో 1989 మార్చి 25న సీఎం కరుణానిధి బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఆ టైమ్‌లో ప్రతిపక్ష నేత జయలలిత జోక్యం చేసుకుని ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని లేవనెత్తారు. ఇది రెండు పార్టీల ఎమ్మెల్యేల మధ్య ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాల ఎమ్మెల్యేలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. మైక్‌లు, పుస్తకాలు విసురుకున్నారు. జయలలిత సభ నుంచి బయటకు వెళ్తుండగా డీఎంకే మంత్రి ఒకరు.. ఆమె చీరను లాగి అవమానించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటన తర్వాత చిరిగిన చీర, చెదిరిన జుట్టుతో జయలలిత సభ నుంచి బయటకు వచ్చారు.

- తమిళనాడు సీఎం జయలలిత మరణం తర్వాత రాజకీయ సంక్షోభం ఏర్పడింది. పళనిస్వామి సీఎంగా మెజార్టీ నిరూపించుకోవాల్సి ఉండగా, ప్రతిపక్ష నేత స్టాలిన్ సీక్రెట్ ఓటింగ్‌కు పట్టుబట్టారు. స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి డీఎంకే ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. కుర్చీలను విరగ్గొట్టారు. స్టాలిన్ తన షర్ట్ చిరిగిపోయిన స్థితిలో అసెంబ్లీ నుంచి బయటకు వచ్చారు.